క్లుప్తంగా

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



ఫిరంగిపురం: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తానన్నారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కోటేశ్వరరావు, డి.ప్రభాకరరావు, యోహాను, సతీష్, కె.శేషు, వై.ప్రకాష్, అప్పారావు, రాము పాల్గొన్నారు.

18 గ్రామాల్లో పశుగణన సర్వే



ఫిరంగిపురం : మండలంలోని 18 గ్రామాల్లో పశుగణన సర్వేను సిబ్బంది నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశుగణన సర్వేను సిబ్బంది నిర్వహిస్తున్నారని చెప్పారు. లైవ్‌స్టాక్ సెన్సెక్స్ ఎన్యూమరేటర్లు, ఏహెచ్‌ఏలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి వాటిని యాప్‌లో నమోదు చేస్తారన్నారు. దీంతో పాటు పశువులు లేని కుటుంబాల వివరాలు కూడా నమోదు చేసి ఆ ఇంటి గడపకు సర్వేకు సంబంధించిన స్టిక్కర్‌ను అంటిస్తారని చెప్పారు. ఇప్పటికే ఫిరంగిపురంతో పాటు, 113తాళ్లూరు, కండ్రిక, శిరంగిపాలెం, గరుడాచలపాలెం, తక్కెళ్లపాడు, వేమవరం, అమీనాబాద్ , వేములూరిపాడు, హౌస్‌గణేష్, మేరికపూడి, నుదురుపాడు, రేపూడి, గొల్లపాలెం, యర్రగుంట్లపాడు, మునగపాడు, బేతపూడి, గుండాలపాడు, పొనుగుపాడు గ్రామాల్లో వేగవంతంగా సిబ్బంది సర్వే చేస్తున్నారని తెలిపారు.

క్వారీలో బాంబు పేలి వ్యక్తి మృతి



మేడికొండూరు: క్వారీలో బాంబు పేలుడు దాటికి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పేరేచర్లలో సోమవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రానికి చెందిన మని (49) కూలి పనుల నిమిత్తం పొట్టకూటి కోసం గత కొన్ని సంవత్సరాలుగా పేరేచర్లలో నివాసం ఉంటున్నాడు. రోజువారి పనులలో భాగంగా పేరేచర్ల పరిధిలో ఉన్న ఒక క్వారీలో రాళ్లు పగలగొడుతున్న క్రమంలో అప్పటికే బాంబులు పెట్టి ఉన్న ఘాతాలకు మని పగలగొడుతున్న రాయి ఘాతాలలో ఉన్న తూటాలకు తగలడం వలన ఒక్కసారిగా బాంబు పేలింది. ఘటనలో మెడ భాగాన రాయి తగలడంతో మని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

పేదలకు నిత్యావసరాలు, బెడ్ షీట్స్ పంపిణీ



బడేపురం (తాడికొండ): తాడికొండ శివారు బడేపురం గ్రామంలో సెయింట్ పాల్స్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు, బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో తాడికొండ, బడేపురం గ్రామాలకు చెందిన 200 మంది పేదలకు రూ.1.50 వేల విలువ చేసే నిత్యావసరాలు, బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, పేదలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ

తాడేపల్లిరూరల్ : గుంటూరు, బాపట్ల, ప్రకాశం , కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సు (ఎస్‌ఏపీ ఎస్‌డీ)లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అనుభవం గల సాప్ ప్రాజెక్ట్ మేనేజర్‌తో శిక్షణ ఇవ్వనున్నామని, నవంబర్ 23వ తేదీ నుంచి ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు 3 నెలల కాలపరిమితితో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వారికి మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాల చెరువు అండర్‌పాస్ వద్ద , కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి తాడేపల్లి రూరల్ కుంచనపల్లి, డీమార్ట్ పక్కన మానవ సేవా సంస్థ కార్యాలయాల్లో శిక్షణ ఇవ్వనున్నామని, ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని మాత్రమే అనుమతిస్తామని, వివరాలకు 9393771663, 9985222857, 7093529750 నెంబర్లను సంప్రదించవచ్చని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూగ జీవాలపై కర్కశం..

అధికారుల చర్యలు శూన్యం

- కబేలాలకు తరలిపోతున్న పశుసంపద
- తనిఖీలు వైపు కన్నెత్తి చూడని అధికారగణం
- అప్పుడప్పుడు పట్టుబడినా కఠిన చర్యలు శూన్యం
- మంగళగిరిలోనూ రోడ్లపై వదులుతున్న యజమానులు

ఆవేదన వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు, గో సంరక్షకులు



మంగళగిరిలో వీధులలో సంచరిస్తున్న గోవులు



లారీలో కుక్కి తరలిస్తున్న గోవులు

మంగళగిరి: మూగ జీవాల వేదన అరణ్య రోదనగా మారింది. పశు సంపద సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జంతు ప్రేమికులు, గో సంరక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో కబేలాలకు తరలుతున్న మూగజీవాలు పట్టుబడడం గో సంరక్షకులను కలవరానికి గురి చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆరుసార్లకు పైగా అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టుబడ్డాయి. ఇక గుట్టు చప్పుడు కాకుండా తరలిపోతున్న గో సంపదకు లెక్కేలేదు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి అధికంగా గోవులను తరలిస్తుండడం విశేషం. పట్టుబడుతున్న గోవులు మేత లేక బక్కచిక్కిపోయి ఉంటున్నాయి.

✦ గోవుల పెంపకందార్లు గోమేత లభించక.. పెంచలేక విక్రయాలు జరుపుతున్నారు. ఇక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గోవులు ఎక్కడకి తరలిపోతున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కువగా కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తూ రవాణాదారులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ అప్పుడప్పుడు పంటుకుంటున్నా అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు మాత్రం లేకపోవడం విశేషం. కనుక రవాణాదారులు అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

✦ మరో వైపు కొందరు అధికారులు పట్టుకుంటున్నా రవాణాదారులు ఇస్తున్న మామూళ్లతో అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని తనిఖీలు నిర్వహిస్తే సుదూర ప్రాంతాలకు గోవుల అక్రమ రవాణా ఎలా జరుగుతుందనే ప్రశ్న తలెత్తుంది.

✦ అలాగే మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోను గోవుల పెంపకందారులు వాటి సంరక్షణను పట్టించుకోకుండా రోడ్లపై వదిలేస్తున్నారు. రోడ్లపై గోవుల సంచారం కారణంగా వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గుర్రై అంగవైకల్యం పొందడంతో పాటు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎద్దులు, ఆవులు నడిరోడ్లపై పోట్లాడుతూ ప్రమాదాలకు కారణమవడంతో ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాల కారణంగా కొందరు గాయపడగా ఒకరిద్దరు తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి.

✦ ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలు ముమ్మరం చేసి గోవులు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని.. గోవుల సంరక్షణకు చర్యలు తీసుకుని, వీధులలో తిరక్కుండా యజమానులు ఇళ్లకు తరలించి సంరక్షించేలా చూడాలని ప్రజలు, గో సంరక్షకులు కోరుతున్నారు.

ఎన్నికల హామీ మేరకు పెట్టుబడి సాయం అందించాలి

– ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ



తాడికొండ: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీల్లో ఇచ్చిన పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతులకు వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ కోరారు. సోమవారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, పొన్నెకల్లు, తాడికొండ గ్రామాల్లో పర్యటించిన వారు రైతులతో మాట్లాడిన అనంతరం ఆయా సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రైవేటీకరణను అడ్డుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కె.పూర్ణచంద్రరావు, ఆర్ శంకరరావు, రేపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక మాస ప్రత్యేక పూజలు







ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తున్న మహిళలు





విద్యుత్ కాంతులీనుతున్న ఆలయం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా మహిళలు ఆలయంలో భారీగా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం రాజధాని నాయకులు

తాడేపల్లిరూరల్ : ఈనెల 8వ తేదీ నుంచి సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని (ప్రజాపోరు) జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పిలుపునిచ్చారు. సోమవారం ఉండవల్లి సెంటర్‌లోని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.రవి కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడుతూ నవంబర్ 8 నుంచి 15 వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇంటింటా సీపీఎం శ్రేణులు ప్రచారం చేయనున్నాయని తెలిపారు. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ ధరలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదం తెచ్చేందుకు జెమిలి ఎన్నికల పేరుతో బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని, స్థలాలు లేని వారికి స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన మండల కేంద్రాల వద్ద జరిగే ధర్నా, నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, నాయకులు ఈమని రామారావు, ఎస్.ఇమ్మానియేలు రాజు, కె.జగదీశ్వర్ రెడ్డి, ఆర్.వి.రాఘవయ్య, పి.గాంధీ, కంచర్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఇంజినీరింగ్ అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు అందుకున్న అధ్యాపకులతో చలపతి విద్యా సంస్థల చైర్మన్ ఆంజనేయులు, ప్రిన్సిపల్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులకు హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ రీసెర్చ్ అకాడమీ (ఎంఎస్‌ఎంఈ) సంస్థ అవార్డులు ప్రదానం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఇంజినీరింగ్, ఉన్నత విద్యా రంగంలో అకడమిక్, రీసెర్చ్ రంగాల్లో వీరు చేసిన కృషికి గుర్తింపుగా అధ్యాపకులు డాక్టర్ ఊట్ల వెంకట సుబ్బారావు, పి.సాయి శ్రీనివాస్‌లకు హెచ్‌వోడీ కేటగిరీలో, డాక్టర్ పి.నాగమల్లేశ్వరరావు, డి.లావణ్యలకు ఉత్తమ అధ్యాపక కేటగిరీలో అవార్డులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అవార్డులు అందుకున్న అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వారు సాధించిన ప్రగతి అద్భుతమని, రాబోయే రోజుల్లో పరిశోధనలపై మరింత దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డి.వినయ్ కుమార్, డీన్‌లు పి.ఫణికుమార్, పి.బాల మురళీకృష్ణ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న నాయకులు

మంగళగిరి: అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ విమర్శించారు. సోమవారం పట్టణ సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 11వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఉచిత ఇసుక విధానం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని.. కొత్త సంస్కరణలు అమలులోకి తెచ్చినప్పటికీ ఇసుక అందడం లేదన్నారు. ఉచిత ఇసుక అందక కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కంటే ఇసుక ధరలు పెరగడంతో పనులు లేక భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు వీధిన పడుతున్నాయని చెప్పారు. ఇసుక ధరలు పెరగడంతో గృహ నిర్మాణదారులు పనులు నిలిపివేసారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్ని సత్యనారాయణ, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును అంగకరించేది లేదు

తాడేపల్లిరూరల్ : ముస్లిం సమాజానికి నష్టం జరిగే విధంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం హక్కులను, సంప్రదాయాలను కాలరాసే ఏ చట్టాలను, సవరణలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము అంగీకరించమని అన్నారు. ముస్లిం సమాజానికి ఎల్లవేళలా అండగా నిలబడి తమ పార్టీ పోరాడుతుందని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి తాజాగా మరోసారి విజయవాడలో జరిగిన వక్ఫ్ పరిరక్షణ సభలో స్పష్టం చేయడం హర్షణీయమని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అట్టడుగు స్థాయికి దిగజారిపోయి ఉన్న ముస్లిం సమాజానికి ఈ కొత్తచట్టం గొడ్డలి పెట్టు వంటిదని, మన పూర్వీకులు వక్ఫ్ చేసిన ఆస్తులు కోల్పోయే ప్రమాదం ఉందని, వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవాలన్న కుట్రపూరిత ధోరణి కనబడుతోందన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు పలకడం శోచనీయమని, పార్లమెంట్‌లోనే టీడీపీ వ్యతిరేకించి ఉంటే జాయింట్ పార్లమెంట్ కమిటీ వరకు వచ్చేది కాదని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డు, కోనేరు సెంటర్, జీఆర్ స్కూలు రోడ్డు, హుస్సేన్ కట్ట, ఇస్లాంపేట, హరిజనవాడ, పాతమంగళగిరి, ఊర్వశి సినిమాహాల్ రోడ్డు, నవులూరులోని ఈఎస్ఆర్ గార్డెన్స్, గోలివారితోట, మక్కెవారి పేట, బాపనయ్యనగర్ ప్రాంతాలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్లు కొట్టుట కారణంగా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

చెరువుల పునరుజ్జీవంపై దృష్టి సారించండి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు కూరపాటి సింగయ్య

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ చిర్రావూరు సచివాలయంలో రైతు సంఘం నాయకులు కూరపాటి సింగయ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 వేలకు పైగా ఉన్న చెరువుల్లో ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యధికంగా 21 వేలకు పైగా ఉన్నాయని, అనేక సంవత్సరాలుగా చెరువులు ఆక్రమణలకు గుర్రై కనీస మరమ్మతులకు నోచుకోలేదని, చెరువుల పునరుజ్జీవంపై దృష్టి సారించాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలు, ప్రజా ప్రతినిధుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, ఉక్కుతో పాటు రైతులకు అవసరమైన పుష్కర యూరియా, క్రూడ్ ఆయిల్, కోలార్వాష్ ఆయిల్, హెవీ క్రూడ్ బెంజాల్ తదితర 20 ఉత్పత్తులను ఉక్కు ఫ్యాక్టరీ అందజేస్తూ దేశ ప్రయోజనాలకు ఉపయోగపడుతోందని అన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతాంగం సాగు చేస్తున్న పంటలకు పంటల బీమా ప్రభుత్వమే భరించి రైతులను ఆదుకోవాలని అన్నారు. ముసునూరు శివశంకర్, మక్కపాటి గోపీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే పెట్టుబడి సాయం అందించాలి



చినకాకాని సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మంగళగిరి: ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం చినకాకాని సచివాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రతి కుటుంబంపై రూ.2.45 లక్షల రుణం ఉందన్నారు. రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం పంట బీమా సొమ్ము జమచేయడంతో పాటు వెంటనే పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కటారి దేవదాస్, ముద్రబోయిన శ్రీను, పాదిలి మరియదాసు, ప్రత్తిపాటి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో తోట చందన

మేడికొండూరు: మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి మేడికొండూరు ఎంపీడీవో తోట చందన అధ్యక్షత వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సల్ స్కిల్ డెవలప్మెంట్ ప్రధాన అధికారి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా నైపుణ్య గణన చేపట్టనున్నట్లు ఎంపీడీఓ చందన తెలిపారు. కార్యక్రమం ఉద్దేశం 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తుల నైపుణ్యాన్ని గుర్తించి వారి ఆకాంక్షలు నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అవసరమైన సమాచారం అందిస్తారని సర్వేకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. రఫీ నైపుణ్యం యాప్ గురించి స్పష్టంగా శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, సచివాలయ ఉద్యోగులు శిక్షణలో పాల్గొన్నారు.

నేడు సచివాలయ సిబ్బందికి శిక్షణ

తాడికొండ: నేడు తాడికొండ మండల పరిధిలోని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సమతా వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వే కోసం తాడికొండ మండలంలోని 15 గ్రామ సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి నైపుణ్య గణన చేయాల్సి ఉండగా వారికి శిక్షణ నిమిత్తం నేడు రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటలకు బండారుపల్లి, దామరపల్లి, పాములపాడు, ఎల్‌జీ పూడి, రావెల, కంతేరు, నిడుముక్కల, మోతడక గ్రామ సచివాలయాల సిబ్బందికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి లాం, పొన్నెకల్లు-1, తాడికొండ- 1,2,3,4 సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరగనుందని అందరూ తప్పక హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు రూరల్: రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని నగరంలో విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ప్రత్తిపాడు నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ప్రత్తిపాడులో ఒక రైస్‌మిల్లు నుంచి అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారంతో రెక్కి నిర్వహించి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



మేడికొండూరు : రాష్ట్రస్థాయి అండర్-17, అండర్-14 ఫుట్ బాల్, హాకీ క్రీడా పోటీలకు మండల పరిధిలోని పాలడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. గుంటూరు జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పాఠశాలకు చెందిన ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. గ్రామస్తులు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరిముల్లా పాల్గొన్నారు.